క్లుప్తంగా

ఆలయంలో పల్నాడు ఎస్పీ పూజలు



అమ్మవారి ఆలయంలో పూజలు చేస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

త్రిపురాంతకం: మండల కేంద్రం త్రిపురాంతకం సమీపంలో ఉన్న శ్రీబాల త్రిపుర సుందరీదేవి, శ్రీ పార్వతీ త్రిపురాంతకేశ్వరస్వామి వారి ఆలయాల్లో పల్నాడు జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఆలయంలో కుంకుమార్చన, స్వామి వారి ఆలయంలో అభిషేకాలు జరిగాయి. అనంతరం అర్చకులు ఎస్పీ శ్రీనివాసరావుకు వేద ఆశీర్వచనం, ప్రసాదాలు అందజేశారు.

రాజంపల్లి విద్యార్థులకు కరాటేలో గోల్డ్ మెడల్



గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

దర్శి: పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో ఆదివారం జరిగిన కరాటే నేషనల్ టోర్నమెంట్‌లో రాజంపల్లి గ్రామానికి చెందిన ఆరుగురు విద్యార్థులు వైట్ బెల్ట్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించారు. రాజంపల్లి మల్లికార్జున హైస్కూల్‌కు చెందిన బి.హరికీర్తి, పి.ఉమాభార్గవి, బి.శరణ్య, ఎన్.సాయిధరణి, సీహెచ్ మంజూష, ఎస్.చరణ్‌లు గోల్డ్ మెడల్ సాధించిన వారిలో ఉన్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ ఎం.చంద్రమోహన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ వై.ధనలక్ష్మిలు అభినందించారు.

డ్రోన్ కెమెరాలతో భద్రత కల్పిస్తాం



డ్రోన్ కెమెరాలు ఎగురవేస్తున్న సీఐ

దర్శి: డ్రోన్ కెమెరాల నిఘాతో పట్టణంలో ప్రజలకు భద్రత కల్పిస్తామని సీఐ రామారావు అన్నారు. పట్టణంలో డ్రోన్ కెమెరాను సోమవారం ఎగురవేసి ట్రైల్ రన్ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ డ్రోన్ కెమెరాలతో నిత్యం పట్టణంలో ఎక్కడ ఏం జరుగుతుందో సమాచారం మేరకు పర్యవేక్షించేందుకు అనువుగా ఉంటుందన్నారు. ఏవైనా ఘటనలు జరిగినా వాటి ద్వారా గుర్తించడం సులభంగా ఉంటుందని చెప్పారు. ఎస్సై మురళి, ఏఎస్సైలు శ్రీనివాసరెడ్డి, రాంబాబు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్ తొలగింపు



చెత్తాచెదారాన్ని తొలగిస్తున్న పొక్లెయిన్

సాక్షి ఎఫెక్ట్..

తాళ్లూరు: మండలంలోని తూర్పుగంగవరం గ్రామ పరిధిలోని ఎర్రవాగు ప్రాంతంలో కొందరు జంతు వ్యర్థాలు వేయడంతో రెడ్డినగర్ ప్రజలు పడుతున్న ఇబ్బందులు పడుతున్నారు. ఈ వ్యవహారంపై 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీనిపై అధికారులు స్పందించారు. సోమవారం పొక్లెయిన్ సాయంతో చెత్తాచెదారాన్ని తొలగించారు. రెడ్డినగర్ ప్రజలకు, వాహనాదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చేశారు.

పేదింటి పిల్లలు ఆటల్లో చిచ్చర పిడుగులు

- రాష్ట్రస్థాయి క్రీడల్లో సత్తా చాటుతున్న పెద్దదోర్నాల విద్యార్థులు
- క్రీడల్లో ఆదర్శంగా నిలుస్తున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల



పతకాలు సాధించిన ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు

పెద్దదోర్నాల: మండల కేంద్రం పెద్దదోర్నాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులంతా గ్రామీణ ప్రాంతానికి చెందిన పేదలే. ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటూనే క్రీడలపై ఉన్న ఆసక్తితో మేటిగా నిలుస్తున్నారు. నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో క్రీడల్లో రాణించి రాష్ట్ర స్థాయిలో పాల్గొని సత్తా చాటుతున్నారు. దీంతో పాటు జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో రాణించేందుకు సిద్ధమవుతున్నారు. నిత్య జీవితంలో ఆరోగ్యంగా ఉండేందుకు వ్యాయామ ఉపాధ్యాయులు పి.రామానాయక్, హెచ్ రామానాయక్‌ల పర్యవేక్షణలో యోగా, అథ్లెటిక్, కబడ్డీ, వాలీబాల్, బాల్ బాడ్మింటన్, టెన్నికాయిట్ తదితర క్రీడాపోటీల్లో పాల్గొని సత్తా చాటుతున్నారు. ఓ వైపు చదువుల్లో రాణిస్తూనే క్రీడలపై సత్తా చాటుతున్న వీరు రానున్న రోజుల్లో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలన్న తమ మనోగతాన్ని వెల్లడిస్తున్నారు.

అమ్మ, నాన్నల ప్రోత్సాహంతోనే:



రోప్ జంప్ స్కిప్పింగ్ అంటే ఇష్టం. నంద్యాలలో జరిగిన రాష్ట్రస్థాయి రోప్ జంప్ స్కిప్పింగ్, తెనాలిలో జరిగిన జాతీయ స్థాయి రోప్ జంప్ స్కిప్పింగ్ పోటీల్లో పాల్గొని స్వర్ణ పతకం సాధించా. అమ్మా నాన్నల ప్రోత్సాహంతోనే ముందుకెళ్తున్నా.

– ముప్వ విజయలక్ష్మి, 9వ తరగతి

క్రీడా కోటాలో ఉద్యోగమే లక్ష్యం:



హైజంప్‌లో పాల్గొనటం అంటే ఇష్టం. శ్రీకాకుళంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన అథ్లెటిక్ పోటీల్లో పాల్గొని రాష్ట్ర స్థాయి ఛాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొని పథకం సాధించా. క్రీడా కోటాలో ఉద్యోగం సాధించడమే లక్ష్యం

– ఉదతల మౌర్య చంద్ర సిద్దార్థ, 9వ తరగతి

జాతీయ స్థాయిలో రాణిస్తా:



యోగా పోటీల్లో పాల్గొని జాతీయ స్థాయిల్లో రాణిస్తా. 2024వ సంవత్సరం విశాఖపట్నం జిల్లా భీమిలిలో జరిగిన రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో పాల్గొని పతకం అందుకున్నా. ఉపాధ్యాయుల సహకారం ఎంతో ఉంది.

– పిక్కిలి వీరాంజనేయులు

ప్రభుత్వ ఉద్యోగం సాధించడమే లక్ష్యం:



2024లో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పార్వతీపురం మన్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ ఈవెంట్‌లో భాగంగా ఆర్చరీ విభాగంలో పాల్గొన్నా. జాతీయ స్థాయిలో రాణించి ప్రభుత్వ ఉద్యోగం సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నా.

– భూమని నాగరాజు, 8వ తరగతి

జీసస్ బాటలో నడవాలి



క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, పక్కన వైఎస్సార్ సీపీ నాయకులు

- ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: జీసస్ చూపిన బాటలో ప్రతి ఒక్కరూ నడవాలని, ప్రేమ, కరుణ కలిగి ఉండాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. సోమవారం స్థానిక వైష్ణవి గార్డెన్స్‌లో జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొని సందేశం ఇచ్చారు. తాను మరణిస్తున్న విషయం తెలిసినప్పటికీ గొర్రె తన యజమానికి సంపద తెచ్చిపెడుతుందని, అటువంటి గొర్రెలకు ఏసు ప్రభువు కాపరిగా ఉండటం మంచి సందేశం ఇచ్చే అంశమని ఆయన పేర్కొన్నారు. నక్షత్రంలో ఉండే కాంతులు ప్రతి కుటుంబంలో వెదజల్లాలని ఆయన కోరుకుంటూ అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ముందుగా కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. అనంతరం నియోజకవర్గ పాస్టర్లకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమానికి పాస్టర్ల సంఘ నియోజకవర్గ అధ్యక్షుడు సన్నెపోగు సుందరరాజు అధ్యక్షత వహించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తిరెడ్డి, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, వైస్ ఎంపీపీ ఎం.ఆదిశేషు, సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ ఎం.బాలగురవయ్య, యర్రగొండపాలెం, పెద్దదోర్నాల మండల పార్టీ అధ్యక్షుడు కె.ఓబులరెడ్డి, జి.రమణారెడ్డి, వై.వెంకటేశ్వరరెడ్డి, షేక్ వలి, పాస్టర్లు బి.వెంకటయ్య, సీహెచ్ ప్రేమసాగర్, బి.సుందరయ్య, ఆనందరావు, డగ్లస్, బి.జేమ్స్ పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో లాభాలు



శనగ పంటపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

పెద్దారవీడు: పంట సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి లాభాలు సాధించవచ్చని ఆత్మ డీపీడీ ఎం.సుబ్రహ్మణేశ్వరరావు, కేవీకే శాస్త్రవేత్త జి.రమేష్ పేర్కొన్నారు. మండలంలో గొబ్బూరు, దేవరాజుగట్టు గ్రామాల్లో జిల్లా వనరుల కేంద్రం, వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు శనగ, కంది, మిరప, జొన్న, వరిగ పంటలను సోమవారం క్షేత్ర పరిశీలన చేశారు. వారు మాట్లాడుతూ కంది పంట ప్రస్తుతం పూత, కాయ దశలో ఉందని, గింజ పరిమాణం పెరగడానికి 13.0.35 ఎరువు మందును వేసుకోవాలని సూచించారు. కందిలో మారుకా మచ్చల పురుగుల ఉధృతి ఎక్కువ ఉందని గుర్తించారు. దాని నివారణకు తొలి దశలో క్లోరిఫైరిపాస్ 2.5 మిల్లి లీటరు తర్వాత నోవాల్యూరాన్ ఒక ఎంఎల్ మిల్లీ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని, ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు స్పైనోసాడ్ 0.3 ఎంఎల్ మిల్లి లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. మిరప పంట ప్రస్తుతం పూత, కాయ దశలో ఉందని, ఎరువుల వాడకాన్ని తగ్గించి ఎకరాకు 35 కేజీలు ఎర్ర పోటాషియం, 10 కేజీల యూరియా కలిపి వేసుకోవాలన్నారు. మిరపలో ఇప్పుడు పూత పురుగు (మిడ్జి ఈగ) ఉందని, ఈ పురుగు ఆశించిన కాయలు ముడుచుకొని పోయి పూర్తిగా అభివృద్ధి చెందకుండా వంకరలుగా మారతాయన్నారు. పురుగు నివారణకు కోలోరిఫిరిఫోస్ లేక వేప నూనె 1500 పీపీఎం 3 ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. శనగ పంటలో వేరుకుళ్లు తెగుళ్లు ఎక్కువగా నీటి ఎద్దడి పరిస్థితిలో, ఉష్ణోగ్రతలు ఉన్నప్పుడు ఆశిస్తుందన్నారు. వేర్లు నల్లగా మారి పూర్తిగా కుళ్లిపోతాయని, తల్లి వేరు తేలికగా ఊడి పోతుందని తెలిపారు. నివారణకు పంట మార్పిడి అవలంబించడం, ట్రైకోడెర్మా విరిడితో విత్తన శుద్ధి చేయాలన్నారు. సకాలంలో విత్తుకుంటే పంట చివరి దశలో నీటి ఎద్దడికి, అధిక ఉష్ణోగ్రత గురి కాకుండా చూసుకుంటే తెగులు తీవ్రతను తగ్గించవచ్చన్నారు. రెండు కిలోల ట్రైకోడెర్మా విరిడి, 10 కిలోల వేప పిండి, 90 కిలోల పశువుల ఎరువులో కలిపి 10–15 రోజులు వృద్ధి చేసి ఎకరా పొలంలో చల్లుకోవాలని చెప్పారు. వ్యవసాయాధికారులు కె.బుజ్జిబాయి, ఎ.శైలజ రాణి, వీవీ శేషమ్మ, ఏఈఓలు సునీల్‌నాయక్, వి.సౌజన్య, వీఏఏలు చిన్నా, విజయలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

కదిలి వచ్చిన జగనన్న సైనికులు



నాయకులను గజమాలతో సన్మానిస్తున్న కార్యకర్తలు



కార్యకర్తలతో కలిసి వెళ్తున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: నియోజకవర్గ నలుమూలల నుంచి జగనన్న సైనికులు కదిలి వచ్చారు. సోమవారం స్థానిక వైష్ణవి గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆత్మీయ సమావేశానికి నియోజకవర్గంలో ఉన్న 5 మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అభిమానులు వేల సంఖ్యలో హాజరయ్యారు. కార్యకర్తల ఉత్సాహాన్ని చూసిన కూటమి ప్రభుత్వ నేతలకు దడ పుట్టించినట్లయింది. అధికారంలో కొనసాగుతోంది వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వమా అనే అనుమానాన్ని పార్టీ కార్యకర్తలు కలిగించారు. తమ అభిమాన నాయకులు ఉమ్మడి ప్రకాశం జిల్లా రీజనల్ కో ఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు, ఒంగోలు పార్లమెంటు ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మలకు స్వాగతం పలికేందుకు వారు ఉత్సాహం చూపించారు. యర్రగొండపాలెం వచ్చిన నాయకులకు రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ శాలువాలు కప్పి పూలమాలలు వేసి ఘన స్వాగతం పలికారు. స్థానిక కొలుకుల రోడ్డులో ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు కార్యకర్తలు వెళ్లారు. అక్కడ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు గజపూలమాలతో అధినాయకులను సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం వైఎస్సార్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్లు, ద్విచక్ర వాహనాలతో సమావేశం జరిగే ప్రాంతానికి వెళ్లారు. సమావేశంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుముల శ్రీనివాసరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తిరెడ్డి, సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ ఎం.బాలగురవయ్య, ఎంపీపీలు దొంతా కిరణ్‌గౌడ్, బెజవాడ గురవయ్య, జెడ్పీటీసీలు చేదూరి విజయభాస్కర్, యేర్వ చలమారెడ్డి, ముస్లిం మైనార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ మజీద్, పార్టీ మండల అధ్యక్షుడు కె.ఓబులరెడ్డి, ఎస్.పోలిరెడ్డి, పి.కృష్ణారెడ్డి, జి.వెంకట రమణారెడ్డి, మాజీ ఎంపీపీ ఆళ్ల ఆంజనేయరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

ఇలా అయితే ఎలా వెళ్లాలి?

- వాహనచోదకులను హడలెత్తిస్తున్న ట్రాఫిక్
- ట్రాఫిక్ జామైనా రోడ్డుపైనే వాహనాలు
- వాహనాల రద్దీతో కురిచేడులో అవస్థలు



కురిచేడు బస్టాండ్ సెంటర్‌లో నిలిచిన ట్రాఫిక్

కురిచేడు: నిత్యం మూడు ఇబ్బందులు.. ఆరు ట్రాఫిక్ జామ్‌లుగా స్థానిక బస్టాండ్ వర్ధిల్లుతోంది. టీడీపీ ప్రభుత్వ హయాంలో రోడ్డు వెడల్పు 120 అడుగులు వచ్చినా అప్పటి రోడ్లు భవనాల శాఖ మంత్రి శిద్దా రాఘవరావు దాన్ని 40 అడుగులకు కుదించి రోడ్డు విస్తరణ చేయించారు. ఆ సమయంలో రోడ్డుపై అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలను నేటికీ తొలగించక పోవడంతో వాటిని సాకుగా చూపి కొందరు రోడ్డుపైకి తమ వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించుకున్నారు. ఆటోలు, తోపుడు బండ్లు రోడ్డుపైనే ఆపుతున్నారు. అంతేకాకుండా ట్రాఫిక్ నిలిచినప్పుడు కూడా వాటిని తీయక పోవడంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి వివిధ పనుల కోసం, కార్యాలయాల్లో పనుల కోసం, వైద్య చికిత్స కోసం ప్రజలు మండల కేంద్రానికి రావటంతో పాటు తిరుగు ప్రయాణంలో బస్టాండ్ సెంటర్‌లో వేచి ఉంటారు. అంతే కాకుండా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ప్రధాన రోడ్డుకు ఆనుకుని ఉండటంతో గ్రామంలోని విద్యార్థులు బస్టాండ్ సెంటర్ నుంచి రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. ఆ సమయంలో విద్యార్థులు, చిన్నారులు, మహిళలు తొలిగేందుకు కూడా అవకాశం లేకపోవడంతో నానా అవస్థలు పడుతున్నారు. అంతే కాకుండా టీషాపుల వద్ద, వివిధ రకాల వ్యాపార సంస్థల ముందు ద్విచక్ర వాహనాలు రోడ్డుపైనే నిలిపి వారి పనులు చూసుకుంటుండటంతో ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది. బస్టాండ్ సెంటర్‌లో ట్రాఫిక్ కంట్రోల్ చేసేందుకు పోలీసు సిబ్బందిని నియమించాలని, లేకుంటే రోడ్డు వెడల్పు చేసి డివైడర్ ఏర్పాటు చేసి ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లించాలి



ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

దొనకొండ: స్థానిక పంచాయతీలో పని చేస్తున్న పంచాయతీ కార్మికులకు పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేశారు. 8 నెలల నుంచి పారిశుధ్య కార్మికులకు వేతనాలు లేక పూట గడవడానికి అప్పులు తెచ్చుకుని ఇబ్బందులు పడుతున్నామని, ఇంట్లో గ్యాస్ అయిపోయినా, ఒంట్లో ఆరోగ్యం బాగా లేకపోయినా, కరెంటు బిల్లులు చెల్లించడానికి అప్పులు తెచ్చుకుని ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని విచారం వ్యక్తం చేశారు. ఎన్నోసార్లు స్థానిక సర్పంచ్‌కు, పంచాయతీ కార్యదర్శికి విన్నవించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. క్రిస్మస్ పండగ లోపు పెండింగ్ వేతనాలు చెల్లించాలని, అదే విధంగా స్వచ్ఛ భారత్ కార్మికులకు మూడు నెలల పెండింగ్ బిల్లులు ఇవ్వాలన్నారు. అనంతరం ఎంపీడీఓ ఎం.శ్రీదేవికి వినతి పత్రం అందజేశారు. స్పందించిన ఆమె క్రిస్మస్ పండగ లోపు వేతనాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ ఉపాధ్యక్షుడు తాండవ రంగారావు, మండల అధ్యక్షుడు కుందుర్తి చిన్న నరసింహులు, కార్యదర్శి చిరుపల్లి అంజయ్య, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

30 మంది విద్యార్థులు ఎన్‌సీసీకి ఎంపిక



ఎన్‌సీసీకి ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ముండ్లమూరు (దర్శి): ప్రకాశం జిల్లా 34వ బెటాలియన్ కింద మోడల్ స్కూల్ ఎన్‌సీసీకి ఎంపికైంది. బెటాలియన్‌కు చెందిన సుబేదార్ సంతోష్‌సింగ్, ఆర్మీ అధికారి వెంకటనారాయణ పాఠశాలను సందర్శించి 70 మంది విద్యార్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో 30 మంది విద్యార్థులను మొదటి బ్యాచ్ ఎన్‌సీసీకి ఎంపిక చేశారు. ఈ సందర్భంగా సుబేదార్ మాట్లాడుతూ భవిష్యత్‌లో త్రివిధ దళాల్లో, పోలీస్ నియామకాల్లో చాలా సులభంగా ఉద్యోగాలు సాధిస్తారని చెప్పారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పూర్ణచంద్రరావు మాట్లాడుతూ ఎన్‌సీసీ మన స్కూలుకు రావడం గొప్ప అవకాశం అన్నారు. ఎన్‌సీసీ ద్వారా భావి భారత పౌరులుగా తీర్చిదిద్దేందుకు అవకాశం ఉందన్నారు. ఎన్‌సీసీ యూనిట్‌కు కేర్ టేకర్‌గా సోషల్ ఉపాధ్యాయులు సాధు వెంకటేశ్వరరెడ్డిని నియమించారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



మాట్లాడుతున్న తహసీల్దార్ శైలేంద్రకుమార్

పెద్దారవీడు: గ్రామ స్థాయిలో భూములకు సంబంధించిన సమస్యలు పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులని తహసీల్దార్ శైలేంద్రకుమార్ అన్నారు. మండల పరిధిలోని బోయిదగుంపుల గ్రామ సచివాలయంలో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రెవెన్యూ సదస్సులో భూ సమస్యలుంటే ఫిర్యాదు చేసుకోవచ్చని, పత్రాలను పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని, సదస్సులో స్వీకరించిన ప్రతి అర్జీకి రశీదు ఇస్తామని చెప్పారు. ఆర్ఐ గోపి, మండల సర్వేయర్ రామగోపాలరెడ్డి, వీఆర్వో భాస్కరరావు, రైతులు పాల్గొన్నారు. మంగళవారం పెద్దారవీడు గ్రామంలో పాత పంచాయతీ కార్యాలయంలో రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు.

నరకానికి దారి..

- అధ్వానంగా మార్కాపురం–తర్లుపాడు రోడ్డు
- ఈ రోడ్డుపైనే 12 గ్రామాల ప్రజల రాకపోకలు



గుంతలమయమైన తర్లుపాడు రోడ్డు



మార్కాపురం - తర్లుపాడు సింగిల్‌రోడ్డు

తర్లుపాడు: కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రోడ్ల మరమ్మతులను గాలికొదిలేశారు. సంక్రాంతికి రోడ్ల మరమ్మతులన్నీ చేస్తామని కూటమి నాయకులు గొప్పగా చెబుతున్నా ఆచరణలో ప్రారంభం కాలేదు. మార్కాపురం – తర్లుపాడు రోడ్డు నరకానికి చిరునామాగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు గుంతలుపడి రాకపోకలకు ఇబ్బందికరంగా ఉంది. అసలే సింగిల్‌రోడ్డు... ఆపై అధ్వానంగా మారడంతో ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే నరకమే. సీతానాగులవరం, తర్లుపాడు, మీర్జపేట, తాడివారిపల్లి, నాగెళ్లముడుపు, చెన్నారెడ్డిపల్లి, గొల్లపల్లి, ఉమ్మారెడ్డిపల్లి, వేములపాడు, కనిగిరి, బోడివర్లమీదుగా కంభం వెళ్లే ప్రధాన రహదారి కావడంతో సుమారు 12 గ్రామాల ప్రజలు ప్రతిరోజూ ఈ రోడ్డుపైనే రాకపోకలు సాగించాల్సి ఉంది. దీంతోపాటు మండల కేంద్రాలైన కంభం, తర్లుపాడు, వేములపాడు మీదుగా కనిగిరి వెళ్లే బస్సులు కూడా ఈ రోడ్డుగుండా వెళ్లాల్సిందే. సింగిల్‌రోడ్డు కావడంతో రాత్రిపూట ప్రమాదాలు జరుగుతున్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతిపాదనలు పంపి నిధులు మంజూరయ్యాయి. అయితే ఎన్నికలు రావడంతో నిలిచిపోయాయి. అప్పట్లో రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు కూడా చేపట్టారు. ప్రస్తుతం రోజుకు అటు.. ఇటుగా 200 వాహనాలు తిరుగుతున్నాయి. వీటితో పాటు స్కూల్ బస్సులు, ఆటోలు అదనంగా తిరుగుతాయి. మార్కాపురం నుంచి తర్లుపాడుకు సుమారు 10 కిలోమీటర్ల దూరం ఉంది. సాధారణంగా అయితే పదినిముషాల్లో చేరుకోవచ్చు. రోడ్డు బాగోలేకపోవడంతో సుమారు అరగంటకు పైగా ప్రయాణ సమయం పడుతోంది.



ఎదురుగా వస్తే కిందకు దిగాల్సిందే

రోడ్డును వెడల్పుచేసి మరమ్మతులు చేయాలి



మార్కాపురం నుంచి తర్లుపాడు రావాలంటే రోడ్డు బాగోలేకపోవడంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి డబుల్ రోడ్డు వేయడంతో పాటు రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చాలి.

– అక్బర్ అలీ, కో ఆప్షన్ సభ్యులు

వాటర్ ట్యాంకుపై యువకుల విన్యాసాలు



వాటర్ ట్యాంకుపై ఆడుకుంటున్న యువకులు

- ఆందోళనలో తల్లిదండ్రులు

మార్కాపురం: ప్రమాదమని తెలియక.. స్కూల్ నుంచి ఇంటికి రాగానే విద్యార్థులు, యువకులు ఇంటికి దగ్గరలో ఉన్న వాటర్ ట్యాంకుపై ఎక్కి ఆడుతున్న ఆటలు.. చేస్తున్న విన్యాసాలు తల్లిదండ్రుల గుండెల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. మార్కాపురం పట్టణ పరిధిలోని పూలసుబ్బయ్య కాలనీలో ఉన్న వాటర్ ట్యాంకుపైకి వారం రోజులుగా విద్యార్థులు స్కూల్ నుంచి రాగానే సాయంత్రం పూట ఎక్కి రకరకాల ఆటలు ఆడుతున్నారు. ప్రమాదవశాత్తు కాలుజారి అటు కిందపడినా.. ఇటు ట్యాంకులో పడినా.. ప్రాణాలు పోవడం ఖాయం. దీంతో ఆ ప్రాంతాల్లో ఉండే తల్లిదండ్రులు ట్యాంకు వద్ద వాచ్‌మెన్‌ను నియమించాలని కోరుతున్నారు.